క్లుప్తంగా

సునీల్ సందీప్‌కు సన్మానం



తెనాలిఅర్బన్: హిప్నాటిజం, ఆక్యుపంచర్ ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ సంస్థలో యాక్టివ్ పార్టిసిపెంట్ అవార్డు పొందిన తెనాలివాసి కారుమంచి సునీల్ సందీప్‌ను గాంధీనగర్‌లోని సీపీఐ కార్యాలయంలో గురువారం సన్మానించారు. కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు బొల్లిముంత కృష్ణ , ఫోటోగ్రాఫర్స్ అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ నాయకులు సాయి, మణి, చిన్ని, రామకృష్ణరెడ్డి, మార్కండేయులు, సాయిమంగ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్ష కార్యదర్శులు రమేష్ కుమార్, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామ రెవెన్యూ సహాయకుల నిరసన



తెనాలి రూరల్: స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వీఆర్ఏలు నినాదాలు చేశారు. కనీస వేతనం రూ. 21 వేలు ఇవ్వాలని, నామినీగా పనిచేస్తున్న వీఆర్ఏల వారసులను రెగ్యులర్ చేయాలని, పే స్కేల్ అమలు చేయడంతో పాటు అర్హులైన వారికి పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. నాయకులు రాజేష్, కిరణ్ కుమార్, సతీష్, లహరోను, సీతారామయ్య పాల్గొన్నారు.

ఘనంగా వెదురు దినోత్సవం



తెనాలిఅర్బన్: ప్రపంచ వెదురు దినోత్సవాన్ని తెనాలి పట్టణ మేదర (మహేంద్ర) సంఘం ఆధ్వర్యంలో మార్కెట్ వద్ద గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా మేదర్ల పితామహుడుగా పిలిచే కేతేశ్వరస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే వెదురుతో చేసిన ఉత్పత్తులకు పూజలు చేశారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు లోకేష్ మాట్లాడుతూ ప్లాస్టిక్ పర్యావరణానికి హానీ కలిగిస్తాయని తెలిపారు. వెదురుతో తయారు చేసిన వస్తువులను వాడటం వలన పర్యావరణానికి ఎటువంటి హానీ జరగదని చెప్పారు. చేతి వృత్తులను ప్రోత్సాహించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు లీలాప్రసాద్, రాంబాబు, మోహన్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోండి

తెనాలిఅర్బన్: మారుతున్న జీవన విధానంలో ఎక్కువ మంది తక్కువ వయస్సులో అనారోగ్యానికి గురవతున్నారని మారీసుపేటలోని అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ ఎస్.రమేష్ పేర్కొన్నారు. దీనదయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన (డీడీయుజీకెవై) స్కిల్ సెంటర్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులకు రైల్వేస్టేషన్ రోడ్డులోని వైష్ణవీ జూనియర్ కళాశాలలో గురువారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలుషిత ఆహారాన్ని తీసుకోకుండా ఇంట్లో వండిన పదార్థాలను తినాలని సూచించారు. ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. అనంతరం 65 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సెంటర్ ఇన్‌చార్జి పాటిబండ్ల శ్రీనివాసరావు, ఆలీ, కళ్యాణి, ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థుల ఇండస్ట్రియల్ విజిట్



చుండూరు(వేమూరు): సాంకేతిక రంగంలో విద్యార్థులు ముందు ఉండాలని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కర్రా శ్రీనివాసరావు తెలిపారు. చుండూరు మండలంలోని యడ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 9, 10, తరగతుల విద్యార్థులు, ఇంటర్మీడియేట్ ఎలాక్ట్రానిక్స్, ఒకేషనల్ చదువుతున్న విద్యార్థులకు గురువారం ఇండస్ట్రియల్ విజిట్ నిర్వహించారు. తెనాలి సుల్తానాబాద్‌లోని కుమార్ పంప్స్, మోటార్ ఇండస్ట్రీని సందర్శించారు. వాటర్ ప్యూరిఫికేషన్ విధానం గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు సాంకేతిక రంగంపై కూడా దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విప్పు త్రివేణి, ఎన్ ప్రసాద్‌బాబు, రుక్మిణీదేవి, అరుణకుమారి, పి.సుజాత, డి.విజయనిర్మల పాల్గొన్నారు.

సత్తురేకుతో సూక్ష్మ కళ



మాట్లు వేస్తున్న కాలేషా. పక్కన తండ్రి సుభాని



సూక్ష్మ విమానాలు

- సృజనకు ప్రతిరూపాలు
- అబ్బురపరుస్తున్న తెనాలి కళారూపాలు

తెనాలి: అతడి జీవితం సత్తురేకుతోనే ముడిపడింది. ఆ రేకుతో అతుకులు చేస్తేనే ఇంటిల్లిపాదికి నాలుగు ముద్దలు నోట్లోకి వెళ్లేది. నిత్యం బతుకుచిత్రం ముడిపడిన సత్తురేకునే తన సృజనకు మార్గంగా ఎంచుకున్నాడో కుర్రాడు. అవకాశం చిక్కినపుడు, మనసు ప్రశాంతగా ఉన్నపుడు సత్తురేకుతో సూక్ష్మ కళారూపాలకు చిత్రిక పడుతున్నాడు. వయసు పెరిగినా సృజన ఆగిపోలేదు. అతడి పేరు షేక్ కాలేషా. చిరునామా పట్టణ మెయిన్‌రోడ్డులో ఉప్పుబజారు కలిసే కూడలి.

ఏడెనిమిది అంగుళాల పొడవుండే రెండు చక్రాల సైకిలు చేశాడు కాలేషా. మరికొన్నాళ్లకు ఇంజను, మూడుబోగీల రైలుబండి రూపొందించాడు. ఒక్కోటి అడుగు చొప్పున రైలుబండి నాలుగు అడుగుల పొడవుతో చేశాడు. మళ్లీ ఇప్పుడు విమానంకేసి చూశాడు. విమానం ఎక్కడం అటుంచి, దగ్గర్నుంచి చూసింది కూడా లేని కాలేషా, చూడ్డానికి ముచ్చటగా ఉండేలా అతి చిన్న విమానాలను తయారుచేశారు. ఒకటి పది అంగుళాలుంటే, రెండోది ఆరంగుళాలు ఉంటుంది. తన దగ్గరకు మాట్లు కోసం వచ్చిన కస్టమర్లకు తాను చేసిన విమానాలను చూపుతుంటాడు. అప్పుడతని కళ్లు సంతోషంతో మెరిసిపోతుంటాయి.

పేదరికమే కాలేషా చదువుకు ప్రతిబంధకమైంది. ఊహ తెలిసింది మొదలు బతుకు పోరాటం చేస్తూనే వున్నాడు. రోజంతా కష్టపడితేనే కాలే కడుపు నిండేది. ఇక బడిగంటలతో సావాసం ఎందుకుంటుంది? అయ్యవార్ల పాఠాలు, బడి గంటలు, మార్కుల గుణింతాల ఊసే లేదు. అయితేనేం! వృత్తిపనిలోనే కాసింత కళాపోషణ చేస్తున్నాడు. స్టీలు, అల్యూమినియం పాత్రలు, బకెట్లకు మాట్లు వేసే పనిలో అతడిది మూడోతరం. వృత్తి ప్రదేశం మాత్రం అదే. కాలేషా తాత షేక్ అబ్దుల్ నబి. 14 ఏళ్ల వయసులో యాకూబ్ అనే మేస్త్రి దగ్గర మాట్లు వేసే పని నేర్చాడు. అదే జీవనోపాధి చేసుకున్నాడు. 93 ఏళ్లు జీవించిన అబ్దుల్ నబీ ఓపిక ఉన్నంతవరకు వృత్తిపనిలో కొనసాగారు. తర్వాత కొడుకు షేక్ సుభాని 15 ఏళ్లప్పుడు తన తండ్రి అబ్దుల్‌నబీ వద్దనే పని నేర్చుకుని, అక్కడే వృత్తి చేస్తూ వచ్చాడు. ప్రస్తుతం ఆయనకు 73 ఏళ్లు. ఇప్పుడు ఓపిక లేదు. కుమారుడు కాలేషా వద్దనే రోజూ కాసేపు గడుపుతుంటారు.

ఆవిధంగా మూడోతరంలో కాలేషా మాట్లు వేసే వృత్తిలో కొనసాగుతున్నారు. మూడుతరాలుగా అదే వృత్తి ప్రదేశం. అక్కడ ఉన్నపుడే తన తాత అబ్దుల్ నబీ ఒకసారి గాంధీని చూశాడని చెప్పారు. మెయిన్ రోడ్డు మీదుగా గాంధీచౌక్‌కు వెళ్లిన గాంధీజీ, అక్కడ గుమిగూడిన ప్రజలతో మాట్లాడారని, ఆ గుంపులో తన తాత కూడా ఉన్నాడని గర్వంగా చెబుతాడు. కాలేషాకు ముగ్గురు కొడుకులు. తనలా కాకూడదని అందరినీ చదివిస్తున్నాడు. తమ వృత్తిలో నాలుగో తరం ఉండకూడదని అతడి నిశ్చితాభిప్రాయం.

విద్యార్థులు సాంకేతిక రంగంపై అవగాహన కలిగి ఉండాలి

డీడీఈ ఎన్.సురేష్‌బాబు



కావూరు సబ్‌స్టేషన్ వద్ద డీడీఈని సత్కరించిన ఉపాధ్యాయులు

చెరుకుపల్లి: విద్యార్థులు పాఠశాల దశ నుంచే సాంకేతిక రంగం, ఎలక్ట్రానిక్ పరికరాల పనితీరు గురించి తెలుసుకుంటే ఉన్నత చదువులకు ఎంతో ప్రయోజనకరమని విద్యుత్ డీడీఈ ఎన్.సురేష్‌బాబు తెలిపారు. గురువారం గుళ్ళపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులు కావూరు విద్యుత్ సబ్‌స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా సురేష్‌బాబు విద్యార్థులకు విద్యుత్ ఉత్పత్తి, దాని సప్‌లై, ట్రాన్స్‌ఫార్మర్ల పనితీరు, సేఫ్టీ ప్రమాణాలు, ఆధునిక విద్యుత్ వ్యవస్థలో వినియోగిస్తున్న పరికరాల గురించి వివరించారు. కార్యక్రమాన్ని పాఠశాల హెచ్ఎం కోనేటి అనిత ఆధ్వర్యంలో పాఠశాల వృత్తి విద్య ఉపాధ్యాయుడు జి.మురళీకృష్ణ పర్యవేక్షణలో విజయవంతంగా నిర్వహించారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థులు సురేష్‌బాబును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కేవీ రామారావు, బి.ధ్యానచంద్ర, జె.శ్రీవిద్య, కె.శివాంజనేయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షోభంలో కూరుకుపోతున్న చేనేత పరిశ్రమ

ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరరావు



చేనేత అధ్యయన యాత్ర జెండా ఊపి ప్రారంభిస్తున్న దృశ్యం

భట్టిప్రోలు: జాతీయోద్యమంలో కోట్లాది మంది ప్రజలకు స్ఫూర్తినిచ్చిన చేనేత రంగం పట్ల పాలక ప్రభుత్వాలు అవలంబిస్తున్న విధానాల ఫలితంగా చేనేత పరిశ్రమ సంక్షోభంలో కూరుకుపోతుండటంతో నేతన్నలు ఆకలి చావులకు బలవుతున్నారని ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరరావు అన్నారు. చేనేత సొసైటీలకు పాలకవర్గ ఎన్నికలు నిర్వహించాలని అలాగే ప్రభుత్వం బకాయిలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో కొనసాగుతున్న చేనేత అధ్యయన యాత్ర గురువారం బాపట్ల జిల్లాలోని భట్టిప్రోలు నుంచి రేపల్లె నియోజకవర్గంలో కొనసాగింది. ఈ యాత్రను సీనియర్ చేనేత కార్మికుడు కొతరపు పార్థసారధి జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి గొట్టుముక్కల బాలాజి, కోశాధికారి బి.మోహన్‌రావు, ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షుడు జి.వెంకట కృష్ణారావు, కె.రామకోటేశ్వరరావు, వెంకట లక్ష్మి, చేనేత కార్మికులు కె.వీరమోహన్‌రావు, బి.రామకృష్ణ, బాపయ్య, వి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదాన కార్యక్రమంలో పాల్గొన్న సిబ్బంది

బాపట్ల అర్బన్: రక్తదానం ప్రాణదానంతో సమానం అని బాపట్ల ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు అన్నారు. బాపట్ల ఏరియా వైద్యశాల ఆధ్వర్యంలో బాపట్ల ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు, కార్యదర్శి మానం నాగేశ్వరరావు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.వి.రాఘవరావు ప్రారంభించారు. ఈ శిబిరంలో కళాశాల విద్యార్థులు, సిబ్బంది 40 మంది రక్తదానం చేశారు. అనంతరం రక్తదానం చేయటం వలన కలిగే ఉపయోగాలను ప్రాముఖ్యతను విద్యార్థులకు తెలియజేశారు. కార్యక్రమంలో ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఏఎస్ఎస్ ఏసీసీ విభాగంకు చెందిన అధ్యాపకులు గోవతోటి జయపాల్, కె.భవాని, వైపి ప్రసాద్, పీడీ రామారావు పాల్గొన్నారు.

డీఎస్సీలో 21వ ర్యాంకు సాధించిన పావనికి సత్కారం



చెరుకుపల్లి: ఇటీవల విడుదల చేసిన మెగా డీఎస్సీ ఫలితాల్లో గుళ్ళపల్లి గ్రామానికి చెందిన చందవోలు పావని ఇంగ్లీష్‌లో జిల్లా స్థాయిలో 21వ ర్యాంకు సాధించటం అభినందనీయమని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఇంకొల్లు రంగారావు అన్నారు. మండల పరిధిలోని గుళ్ళపల్లి మండల ప్రజా పరిషత్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు ఎండీ విస్సార్ అహ్మద్ అధ్యక్షతన గురువారం అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ పావని ఎంతో కష్టపడి చదివి జిల్లాలో 21వ ర్యాంకు సాధించిందన్నారు. పావని ఉద్యోగ రీత్యా మంచి పేరు తెచ్చుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం ఉపాధ్యాయులు పావనిని దుశ్శాలువా, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పడమట వెంకటేశ్వరరావు, యరగళ్ళ నాంచారయ్య, గుళ్ళపల్లి పంచాయతీ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చినపరిమిలో మహిళలకు వైద్య పరీక్షలు



చినపరిమిలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ చంద్రిక

చుండూరు(వేమూరు): ముందస్తు వైద్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా మహిళలు వ్యాధుల బారిన పడకుండా ఉండటం జరుగుతుందని చుండూరు పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ చంద్రిక తెలిపారు. చుండూరు మండలంలోని చినపరిమి గ్రామంలో శుక్రవారం స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్ అభియన్ కార్యక్రమం ద్వారా మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. రక్తపోటు, మధుమేహం, నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్‌కు సంబంధించి వైద్య సేవలు అందించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం ఈ నెల 17వ తేది నుంచి అక్టోబరు 2 వరకు వైద్య శిబిరాలు నిర్వహించడం జరుగుతుందని ఆమె తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఈ క్రాప్ ఉన్న వారికే ఎరువులు అనడం సరికాదు

సీపీఎం మండల కమిటీ సమావేశంలో నాయకులు



భట్టిప్రోలు: భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్స్) భట్టిప్రోలు మండల కమిటీ సమావేశం స్థానిక కార్యాలయంలో గురువారం నిర్వహించారు. బాపట్ల జిల్లా కార్యదర్శి సీహెచ్ గంగయ్య హాజరై మాట్లాడుతూ ఈ క్రాప్ ఉన్న వారికి మాత్రమే ఎరువులు ఇస్తామని చెప్పడం సరైనది కాదని, ఈ క్రాప్ నమోదు ప్రక్రియను ప్రారంభించకుండా గ్రామాలలో ఈ క్రాప్ చేయకుండా కౌలు రైతులకు ఎరువులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. వెంటనే ఈ క్రాప్ నమోదు ప్రారంభించాలని సీపీఎం డిమాండ్ చేస్తుందన్నారు. పంట వేసిన కౌలు రైతుకే ఈ క్రాప్ నమోదు చేసి వారికి అవసరమైన రుణాలను బ్యాంకర్ల నుంచి ఇవ్వాలని యజమానితో సంబంధం లేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డు ఇవ్వాలని కోరారు. ఈ నెల 22వ తేదీన కౌలు రైతులు సమస్యలపై చేస్తున్న ధర్నాకు సీపీఎం సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు టి.కృష్ణమోహన్, మండల కమిటీ సభ్యులు జి.సుధాకర్, మురుగుడు సత్యనారాయణ, గోళ్ళ నాగరాజు, దీపాల సత్యనారాయణ, పి.మనోజ్‌కుమార్ పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్లను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ



బాపట్లటౌన్ : పట్టణ, గ్రామీణ పోలీస్ స్టేషన్, బాపట్ల రూరల్ సర్కిల్ కార్యాలయాన్ని గురువారం జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేసుల దర్యాప్తులో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ వేగవంతంగా నేరాలను ఛేదించాలన్నారు. నేరాలను కట్టడి చేయడంపై ప్రధానంగా దృష్టి సారించాలన్నారు. ప్రతి రోజు సాయంత్రం 6 గంటల నుంచి విజిబుల్ పోలీసింగ్ నిర్వహించాలన్నారు. మహిళలు, చిన్నారులపై నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో బాపట్ల డీఎస్పీ జి.రామాంజనేయులు, బాపట్ల ఎస్బీ సీఐ జి.నారాయణ, బాపట్ల పట్టణ, రూరల్, బాపట్ల రూరల్ సర్కిల్ సీఐలు పాల్గొన్నారు.

గుడిలో దొంగతనం కేసులో ముద్దాయిలకు జైలు శిక్ష

భట్టిప్రోలు(వేమూరు): శివాలయంలో దొంగతనం చేసిన ముద్దాయికి కోర్టు జైలు శిక్ష విధించిందని ఎస్ఐ శివయ్య తెలిపారు. రేపల్లె ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో ముగ్గురిపై నేర నిరూపణ కావడంతో గురువారం ఏడు నెలలు జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చినట్లు ఆయన తెలిపారు. భట్టిప్రోలు మండల కేంద్రంలోని శివాలయంలో 2024 జూలై 12వ తేదీన 10 వెండి వస్తువులు, పూజకు సంబంధించిన 2.2 కిలోల వెండి వస్తువులు దొంగతనం చేశారు. ఈ విషయంపై ఆలయ ధర్మకర్త కర్ల శ్రీనివాసరావు భట్టిప్రోలు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్ఐ కేసు నమోదు చేశారు. 2024 ఆగస్టు నెల 17వ తేదీన ఆలపాడ బ్రిడ్జి వద్ద వెండి ఆభరణాలు దొంగిలించిన నిందితులు కారంపూడి విజయ్‌కుమార్, తాటిపర్తి సాయి, బండ్లకట్ల పవన్ కళ్యాణ్‌లను అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పరిచారు. కేసు విచారణలో భాగంగా రేపల్లె ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి దేవిసాయి శ్రీవాణి, ఏడు నెలల జైలు శిక్ష విధించారని ఎస్ఐ శివయ్య తెలిపారు. కూరగంటి జ్యోతి ప్రాసిక్యూషన్ చేశారని ఆయన తెలిపారు.

మహిళలు, చిన్నారులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సి.హెచ్‌వి.సుబ్బారావు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సర్పంచ్, వైద్యులు

తెనాలిటౌన్: మహిళలు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని కొలకలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సి.హెచ్.వి. సుబ్బారావు పేర్కొన్నారు. రూరల్ మండలం కఠెవరం పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసినట్లు డాక్టర్ సి.హెచ్.వి.సుబ్బారావు తెలిపారు. పంచాయతీ సర్పంచ్ బండికళ్ళ ప్రసాద్ పాల్గొని వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం పోస్టర్ ఆవిష్కరించారు. దాదాపు 150 మంది పైబడి మహిళలు, చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు ఉచితంగా అందజేశారు. సర్పంచ్ ప్రసాద్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ జన్మదిన సందర్భంగా స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ఈ నెల 17వ తేదీ నుంచి అక్టోబర్ 2 వరకు నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. డాక్టర్ సుబ్బారావు మాట్లాడుతూ అక్టోబర్ 2వ తేదీ వరకు మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రతి రోజు మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి మహిళలు, చిన్నారులకు వైద్యసేవలు అందించనున్నట్లు తెలిపారు. మహిళలకు బీపీ, షుగర్, నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ వంటి ప్రాథమిక పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులతో పాటు సలహాలు, సూచనలు ఇచ్చినట్లు వెల్లడించారు. అధిక వర్షాలకు సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నందున ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని సూచించారు. జలుబు, దగ్గు, జ్వరం ఉన్న వారికి రక్త పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేశారు. శనివారం మండలంలోని నందివెలుగు గ్రామంలో మెడికల్ క్యాంపు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ దిలీప్, పంచాయతీ కార్యదర్శి గౌస్ మోహిద్దీన్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.యామిని, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పన్నుల వసూలు వేగవంతం చేయండి

మున్సిపల్ ఇన్‌చార్జ్ కమిషనర్ పి.శ్రీకాంత్



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ కమిషనర్ శ్రీకాంత్

తెనాలిఅర్బన్: ఇంటి, ఖాళీ స్థలాల పన్నుల వసూలను వేగవంతం చేయాలని మున్సిపల్ ఇన్‌చార్జ్ కమిషనర్ పి.శ్రీకాంత్ ఆదేశించారు. సచివాలయ ఉద్యోగులతో గురువారం మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పన్ను చెల్లింపుదారులను ఉద్యోగులు కలిసి వాటిని వసూలు చేయాలని సూచించారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా సూచించిన అన్ ఎసెస్మెంట్, అండర్ ఎసెస్మెంట్‌ల వివరాలను సేకరించాలని సూచించారు. ఇందుకోసం అడ్మిన్‌తో పాటు ఎమినిటీ, వెల్ఫేర్ సెక్రటరీలు, మహిళా పోలీసులు ఒక బృందంగా ఏర్పడి వచ్చే నెల 10వ తేదీ లోపు పూర్తి చేయాలని సూచించారు. వీటిని గుర్తించే విషయంలో ఎటువంటి అనుమానాలు ఉన్న వెంటనే రెవెన్యూ అధికారితో మాట్లాడి నివృతి చేసుకోవాలని సూచించారు. రెవెన్యూ ఆఫీసర్ రాంప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా దీనిని నిర్వహిస్తుందన్నారు. దీని వలన మున్సిపాలిటీ కూడా ఆదాయం పెరిగే అవకాశం ఉందని చెప్పారు. సమావేశంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

రిమోట్ వీల్ ఛైర్ పంపిణీ



వికలాంగుడికి వీల్ చైర్ అందజేస్తున్న సైనిక వెల్ఫేర్ అధికారి గుణశీల

తెనాలిఅర్బన్: చినరావూరు తోటకు చెందిన ఓ వికలాంగుడికి ఆంధ్రప్రదేశ్ సైనిక సంక్షేమశాఖ డైరెక్టర్ బ్రిగేడియర్ వి.వి.రెడ్డి, విశ్రాంత అధికారి వి.యస్.ఎం సంయుక్త సహకారంతో గురువారం రిమోట్ వీల్‌ఛైర్, రూ.2500 పెన్షన్‌ను జిల్లా సైనిక్ వెల్ఫేర్ అధికారిణి గుణశీల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విశ్రాంత సైనిక ఉద్యోగి తురుమెళ్ల నాగరాజు కుమారుడు పుట్టుకతో అంగవైకల్యంతో బాధపడుతూ ఉన్నాడని తెలిపారు. విషయం తెలుసుకున్న సైనిక సంక్షేమశాఖ వికలాంగుడికి వీల్ ఛైర్‌ను అందజేయడంతో పాటు ప్రతినెలా రూ.2500 పెన్షన్ ఇవ్వనున్నట్లు చెప్పారు. అధికారులకు వికలాంగుడి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. చినరావూరులో జరిగిన కార్యక్రమంలో సైనిక వెల్ఫేర్ ఆఫీసర్ సూపరింటెండెంట్ ఎ.ఆనందరావు, విశ్రాంత సైనిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు కనపర్తి మహారాజు, నాయకులు ఎండీ ఫరీద్, నారాయణం కమల్ కుమార్, పెద్దిశెట్టి సురేష్‌కుమార్, పినపాటి రత్నం, సుభానీ, మాధురి, సుబ్రమణ్యం, తదితరులు పాల్గొన్నారు.

రేపు అనిశెట్టి రజిత సంస్మరణ సభ

తెనాలి: సామాజిక ఉద్యమకారిణి, దళిత బహుజన రచయిత్రి, కవయిత్రి అనిశెట్టి రజిత సంస్మరణ సభను ఈనెల 20న తెనాలిలో నిర్వహించనున్నారు. పట్టణానికి చెందిన సాహితీ సాంస్కృతిక వేదిక 'భిన్నస్వరాలు' ఆధ్వర్యంలో ఆరోజు సాయంత్రం ఆరు గటలకు కవిరాజ పార్కులోని వీజీకే భవన్‌లో ఏర్పాటయే సభను జుగాష్‌విలి నిర్వహిస్తారు. ప్రముఖ రచయిత్రి చల్లపల్లి స్వరూపరాణి, 'విరసం' అధ్యక్షుడు అరసవెల్లి కృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నిధి (బ్రహ్మచారి), జనసాహితికి చెందిన కొత్తపల్లి రవిబాబు, ప్రముఖ రచయిత్రి భండారు విజయ, సావిత్రిబాయి పూలే ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ ట్రస్ట్, విశాఖపట్నం గూడూరు సీతామహాలక్ష్మి, రజిత స్నేహితులు, ఉద్యమ సహచరులు పాల్గొంటారని నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు.

భవిత సెంటర్ తనిఖీ

కర్లపాలెం: ప్రత్యేక అవసరాలు గల చిన్నారుల పట్ల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని సమగ్ర శిక్ష ఏఈ నాగజ్యోతి సహిత విద్య సమన్వయకర్త జ్యోత్స్న చెప్పారు. కర్లపాలెం పంచాయతీ పరిధిలోని ఇందిరానగర్ గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో ఉన్న భవిత సెంటర్‌ను సమగ్ర శిక్ష ఏఈ నాగజ్యోతి, సహిత విద్య సమన్వయకర్త జ్యోత్స్న గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల చిన్నారుల కోసం ఫ్రెండ్లీ టాయిలెట్స్ నిర్మించేందుకు కావలసిన స్థలాన్ని ఏర్పాటు చేయాలని ప్రాథమిక పాఠశాల హెచ్ఎం శైలజను కోరారు. అనంతరం పాఠశాల ఆవరణలో స్థల పరిశీలన చేశారు. కార్యక్రమంలో భవిత సెంటర్ ఉపాధ్యాయులు ఎన్.లక్ష్మీప్రసన్న, సీహెచ్ చందన ఉన్నారు.

ఉచిత కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం



అద్దేపల్లి(భట్టిప్రోలు): భట్టిప్రోలు ఫ్రెండ్స్ అసోసియేషన్ (బీఎఫ్ఏ) ఆధ్వర్యంలో గురువారం స్థానిక అద్దేపల్లిలో మూడవ విడత మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ కేంద్రంను ప్రారంభించారు. బొలిశెట్టి జయబాబు ఆర్థిక సహకారంతో చేపట్టిన శిక్షణ కార్యక్రమాన్ని జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరి పాల్గొని ప్రారంభించారు. మహిళలు అన్ని రంగాలలో ప్రావీణ్యం సంపాదించాలని, మహిళా సాధికారత ముఖ్యమని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఎఫ్ఏ నిర్వాహకులు బొలిశెట్టి శ్రీనివాసరావు, వంగర బాబూజీ, పసుపులేటి శివరామప్రసాద్, తిరువీధుల బాలాజి తదితరులు పాల్గొన్నారు.

నోటీసు

IN THE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE :: TENALI

Between: O.S.35/2020

Malempati Srinivasa Rao ...Plaintiff

Vs

Malempati Jahwarlal and 3 others ...Defendants

టు

3వ ప్రతివాది అయిన తోట వెంకటసుబ్బమ్మ భర్త సాయిబాబు, డోర్ నెం. 1-26-15/3, ఫ్లాట్ నెం.103, సాయి రెసిడెన్సీ నాజరుపేట, తెనాలి, గుంటూరు జిల్లా.

4వ ప్రతివాది అయిన ఆవుల రూపాదేవి భర్త కొర్రపాటి నాగ అంజని వినయకుమార్, డోర్ నెం. 13-13-13/1, శైలానభవన్ రోడ్డు, సాయి గణేష్ ఆజాద్ రోడ్డు, చెంచుపేట, తెనాలి, గుంటూరు జిల్లా.

పై నెంబరు దావాలో 3 మరియు 4 అయినటువంటి ప్రతివాదులకు సమన్లు నిమిత్తం పేపర్ పబ్లికేషన్ ద్వారా తెలియజేయమని శ్రీయుత కోర్టు వారు ఉత్తర్వులు ఇచ్చియున్నారు. కావున పైన ఉదహరించిన ప్రతివాదులు ది.08-10-2025న ఉదయం 10.30 ని లకు పై కోర్టు వారి ఎదుట హాజరై తమరికి గల ఆక్షేపణలు తెలుపుకోనవలసినదిగా లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడునని ఈ బహిరంగ నోటీసు ద్వారా మీకు తెలియజేయడమైనది.

కంభంపాటి వెంకటేశ్వరరావు
వాది తరపు అడ్వకేట్
తెనాలి, గుంటూరు జిల్లా
98494 14350